# పారాహుషార్

డాక్టర్ శ్రీకాంత్ డ్రస్ చేసుకుని రెడీ అయ్యాడు. ఇంక మేడ దిగి కారులో తన డిస్పెన్సెరీకి వెళ్లాలి! కాలింగ్‌బెల్ మ్రోగింది. ఈ టైంలో పేషెంట్లు ఎవరూ ఇంటికి రారు. డిస్పెన్సెరీకే వస్తారు.

కొంచెం విస్సుగ్గా వరండాలోకి వచ్చాడు. ఎదురుగా ఒక యువకుడు నిర్లక్ష్యంగా నిలబడివున్నాడు.

"ఎవరు కావులి?" శ్రీకాంత్ విసుగ్గా అడిగాడు.

"డాక్టర్‌గారు" కరుగ్గా వుంది గొంతు

"ఎస్ పేషెంట్"!

"ఈ కవరు మీకిమ్మన్నారు" . మొరటుగా జేబులోంచి ఓ రోజ్ కలర్ కవర్ తీసి అందించాడు.

"ఎవరు"? ప్రశ్నకు సమాధానం రాలేదు. అతను ఎటో చూస్తున్నాడు.

ఒళ్లు మండిపోయింది శ్రీకాంత్‌కు. అయినా నిగ్రహించుకుని కవర్ ఓపెన్ చేసి కుర్చీలో కూర్చుని చదవసాగాడు.

"డాక్టర్ శ్రీకాంత్,

మేం విప్లవకారులం. మీ ఊళ్లో స్థావరం ఏర్పాటు చేసుకున్నాము. ఒక ఆశయ సిద్ధికోసం పోరాడుతున్నాము.. బహుశా పేపర్లో మా ఆశయాల గురించి.. మా చిత్తశుద్ధి గురించి చదివే వుంటావు.. వినేవుంటావు.

ఈ కవరు నీకందిస్తున్నవాడు మావాడు...

అతనికి యాభైవేలు ఇచ్చిపంపు!

పిచ్చివేషాలు వేసినా.. అతడ్ని పోలీసులకు పట్టివ్వాలని చూసినా నువ్వేకాదు నీ భార్యబిడ్డలు నామరూపాలు లేకుండా పోతారు. జాగ్రత్త! మా శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనా వేసి అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోకు.

-రాడికల్స్

డాక్టర్ శ్రీకాంత్ మొహం చెమటతో తడిసిపోయింది. కాళ్లు చేతులు చల్లబడ్డాయి.

"ఏం డాక్టర్ ఎంతసేపు, నాకవతల పనులున్నాయి. డబ్బితే"! అగంతకుడు కరుగ్గా అడుగుతున్నాడు.

ఎక్కడాలేని మొండి ధైర్యం వచ్చింది. ఒకటా రెండా యాభైవేలు ఎవడబ్బ సొమ్మని...

"మిస్టర్ నీ పేరు ఏదైతే ఏంలే నా దగ్గర అంత డబ్బు లేదు. మీ కెవరో నా గురించి రాంగ్ ఇన్‌ఫర్మేషన్ ఇచ్చి వుంటారు.

మీరనుకున్నట్లు నేను కోటీశ్వరుడ్ని, లక్షాధికార్ని కాదు" నిదానంగా చెబుతున్నాడు.

"డాక్టర్ నాకు కావలసింది-డబ్బు హరికతలు కాదు. మీకీ సాయంత్రం అయిదుదాకా టైమిస్తున్నాం అంటే సరిగ్గా ఆరుగంటలు. ఈలోగా క్యాష్ రెడీ చేసుకో. ఎక్కడ అందజేయాల్సింది తెలియజేస్తాం. తెలివిగలవాడివి అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకోమాకు బై" పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

నిశ్చేష్టుడై నిలబడి చూస్తుండిపోయాడు శ్రీకాంత్. అతను వీధి తలుపు దగ్గర ఎవరి సైకిల్ మీదో వెళ్లిపోయాడు.

ఏం చేయాలో పాలుపోలేదు. తేరుకున్న తరువాత భార్య లక్ష్మిని పిలిచి విషయం

చెప్పాడు. ఆమె ఏడ్చేసింది. పిల్లలకు చెప్పాడు. భయపడిపోయారు.

ఫ్రెండ్స్‌కు ఫోన్ చేశాడు. ఊళ్లో అంతకుముందు రోజు నలుగురైదుగురికి ఇలాంటి లెటర్స్ వచ్చినట్లు తెలిసింది. చాలామంది మిత్రులు తమ దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు. భార్యబిడ్డలతో, బంధువులతో సమాలోచనలు చేయసాగాడు.

"ఏమండీ ప్రాణం కంటే వెధవ డబ్బు ముఖ్యమాండి. నా మంగళసూత్రం కాపాడండి'. శ్రీ లక్ష్మి ఏడుస్తోంది.

"నాన్న రాడికల్స్‌తో పెట్టుకోకూడదు. వాళ్లు ఎంతకయినా తెగిస్తిరు" మీసాలు సరిగా రాని మొలవని కొడుకు చంద్రం సలహా.

"అవును డాడీ మనకున్న ఆస్తిలో యాభైవేలు ఓ లెక్క కాదు. అదిచ్చేస్తే మనందరం హ్యాపీగా బ్రతకొచ్చు. ముష్టి యాభైవేలు" కూతురు రత్నం చెప్పింది.

"చూడండి. అక్కడికి నేనేదో డబ్బు పిచ్చి వాడ్ని అనుకోకండి. ఈ రోజు యాభై అడిగారు ఇస్తాం. ఎల్లుండి లక్షలు అడగరని గ్యారంటి ఏమిటి? ఇలా ఎన్నాళ్లని ఇస్తాం. దీన్నిమొగ్గలోనే తుంచేయాలి. నాది కష్టార్జితం. చూస్తూ చూస్తూ ఊరికే ఇవ్వలేను. నా నిశ్చయం వినండి. డబ్బు మటుకు ఇచ్చేదిలేదు. ఏం చేస్తారో చూస్తాను!" దృఢంగా అన్నాడు డాక్టర్ శ్రీకాంత్.

అందరూ మౌనం దాల్చారు. ఇష్టమున్నా లేకపోయినా ఇంటి పెద్దమాట శిరోధార్యం ఆ ఇంటిలో.

ఆ తరువాత శ్రీకాంత్ చకచక మిగతాపనులు కానిచ్చాడు. తన స్నేహితుడి ద్వారా సిఐ చిదంబరాన్ని కలిసి ఆ లెటర్ చూపించి విషయం చెప్పాడు.

ఊళ్లో అంతకుముందు చాలామంది బ్లాక్ మార్కెటీర్లకు రాడికల్స్ నుండి ఇటువంటి లెటర్స్ వచ్చినట్లు సిఐ ధృవీకరించాడు.

సాయంత్రం అయిదుదాటి ఒక్క నిముషం అయింది.

పోన్ రింగయింది. శ్రీకాంత్ రిసీవర్ తీశాడు.

"శ్రీకాంత్ తెలివితేటలు నీ స్వంతమనుకోకు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. డబ్బు తెస్తానంటే నిన్ను క్షమిస్తాం. లేదూ నీ మరణం మా చేతుల్లో వుంది ఖాయం".

శ్రీకాంత్ మొహం చెమటతో తడిసిపోయింది. పోలీసులొచ్చి నిలబడితే జరిగిందంతా చెప్పాడు. వార్త సిఐకి చేరింది. సిఐ ఫోన్ అబ్జర్వేషన్ పెట్టించాడు. సిఐ అబ్జర్వేషన్‌లో గట్టి బందోబస్తు చేయించాడు.

మర్నాడు మధ్యాహ్నం పోస్టుకి వచ్చింది ఒక అపరిచిత వ్యక్తి రాసిన ఉత్తరం! మేటర్ టైపయింది. సంతకంలేదు.

"శ్రీకాంత్ ఫోన్ అబ్జర్వేషన్ పెట్టించావుకదూ జాగ్రత్త! మా హిట్ లిస్టులో చేరిపోయావు. ఏదో ఒక రోజు మా తుపాకులకు ఎర కావడానికి సిద్ధంగా వుండు"

సిఐ చూశాడు ఉత్తరాన్ని రాడికల్స్ ఊళ్లోంచి వెళ్లిపోయేదాకా బయటకు వెళ్ళవద్దని సలహా ఇచ్చాడు. పిల్లల్ని కూడా పోలీసుల సాయం లేందే ఎక్కడికీ పంపవద్దని సలహా ఇచ్చాడు. పోనీ డబ్బు ఇచ్చి ఈ న్యూసెన్స్ నుంచి బయటపడుతామంటే అది పోలీసులకు పరువు సమస్య!

రోజులు భారంగా గడుస్తున్నాయి. పోలీసులకు నాలుగుపూట్ల ఇంట్లోనే భోజనాలు, టిఫిన్లు డిస్పెన్సెరికి పోవడం లేదు. పేషెంట్లు మోహన్ దగ్గరికి వెళ్లిపోయారు. పిల్లల చదువులు కూడా దెబ్బతిన్నాయి. మిత్రులు ఎవరూ ఇంటికి రావడంలేదు. పోలీసుల దృష్టిలో రాడికల్స్ దృష్టిలో పడడం ఇష్టం లేక ఫోన్ చేయడానికి కూడా భయపడుతున్నారు.

పోలీసులు రాడికల్స్‌ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఊళ్లో వాళ్లు మటుకు కాస్త కూస్త ముట్టచెప్పి బయటపడ్డారు.

డాక్టర్ మటుకు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. రెండునెలలుగా డిస్పెన్సరీకి పోక తనకు కనీసం యాభైవేలు నష్టం! అదనంగా ఎంతో ఖర్చయింది. ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి.

ఇక లాభం లేదనుకొని పోలీసులసాయంతో డిస్పెన్సరికిరావడం మొదలుపెట్టాడు.

కానీ పేషెంట్స్ బాగా తగ్గిపోయారు. అంతకుముందు రెండు వందలదాకా వస్తే ఇప్పుడిరవైమందిరావడం కష్టమైపోయింది. మోహన్ డిస్పెన్సరీ బాగా పుంజుకుంది. పాత పేషెంట్లందరు తన దగ్గరకే వెళుతున్నారు. ఇప్పుడు తను నెంబరు త్రీ కూడా కాదు.

రాడికల్స్ వెళ్లిపోయారనిపోలీసులు చెప్పారు. అయినా పోలీసు గస్తీ వుంచుకున్నాడు అలాగే.

కొన్నాళ్లకు సిఐ చిదంబరం తేల్చి చెప్పాడు. రాడికల్స్ అతన్ని బెదిరించడం ఒట్టి ఫాల్సని , ఎవరో గిట్టనివాళ్ళు చేసారని, ఊళ్ళో భయం చూసి పనిలో పని అని వాళ్ల పేరు పెట్టి ఎవరో లెటర్ రాసారని! కనుక ఇప్పుడతను స్వేచ్ఛగా కదలవచ్చని చెప్పాడు.

ఆలోచించగా ఆలోచించగా ఆ పని డాక్టర్ మోహన్ ఎందుకుచేసి వుండకూడదు అనిపిస్తోంది శ్రీకాంత్‌కు.

కొన్నాళ్లకి తాగిన మైకంలో మోహన్ కొడుకు శ్రీకాంత్ ప్రాక్టీస్ పడగొట్టడానికి రాడికల్స్ పేరుతో బెదిరించింది నేనే అని ఇంకో తాగుబోతుతో అనగా అది అలా అలా శ్రీకాంత్ చెవినపడింది.

కానీ అప్పటికే మోహన్ ప్రాక్టీసు బాగా వృద్ధి పొందింది. శ్రీకాంత్ ప్రాక్టీసు పడిపోయింది.

(ఆదివారం ఆంధ్రభూమి)

